

అల్లూరి సీతారామరాజు

ఆశ్రమ విద్యార్థిని హఠాన్మరణం



మృతి చెందిన విద్యార్థిని మర్రి లక్ష్మి

ప్రజాశక్తి -జి.మాడుగుల : ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి చెందిన ఘటన అల్లూరి జిల్లాలో చోటుచేసుకుంది. జి.మాడుగుల మండలం బందవీధి ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మర్రి లక్ష్మి మంగళవారం ఉదయం విరామ సమయంలో తరగతి గది నుండి వెళుతూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఉపాధ్యాయులు హుటాహుటిన పాడేరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందిన ట్లు వైద్యులు నిర్ధారించారు మృతి చెందిన విద్యార్థిని స్వగ్రామం సోలభం పంచాయతీ సారిబయలు. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి నేలపై చదువులు!

- మంగళపాలెం ప్రాథమిక పాఠశాల గిరిబాలల అవస్థలు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని నేతలు, అధికారులు
- శిథిల భవనంలో ప్రాణభయంతో తాత్కాలిక షెడ్ ఏర్పాటు

ప్రజాశక్తి- జికె.వీధి : శిథిలావస్థకు చేరుకుని వర్షపునీరు కారుతూ, ఏ క్షణాన కూలుతుందో తెలియని ప్రమాదకర పరిస్థితిలో ఉన్న పాఠశాల భవనంలో చదువులకు భయాందోళన చెందిన విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, తాత్కాలిక రేకుల షెడ్ నిర్మించి మట్టినేలలో పరదాలపై కూర్చుని చదువుకోవాల్సిన దుస్థితి జికె.వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెంలో నెలకొంది. పశువుల పాకను మరిపించేలా ఉన్న షెడ్‌లో మట్టి దడికి, నేలపైనా పరదాలువేసి అక్కడే విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న గిరిబాలల అవస్థలు చూస్తే ఎవరికైనా హృదయం ద్రవించక మానదు. అధికారులు, నేతలు స్పందించి, శిథిలభవనం స్థానే కొత్త పాఠశాల భవనాన్ని పునర్నిర్మించి విద్యార్థుల వసతికష్టాలకు విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మండలంలోని దేవరాపల్లి పంచాయతీ, మంగళపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంఇ. చినుకు పడితే భవనంలోపల వర్షించడంతో పాటు ఎపుడు కూలు తుందోనన్న భీతావహ పరిస్థితిలో ఉంది. ఇటువంటి భవనంలో చదువులను పక్కనపెడితే, పిల్లల ప్రాణాలకు ప్రమాద మని గమనిం చిన స్థానిక గిరిజనులు, తల్లి దండ్రులు, సమస్యను అనేకసార్లు నేతలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో, గ్రామస్తులే తాత్కాలిక రేకుల షెడ్‌ను నిర్మించి, అందులో పాఠశాలను నిర్వహిస్తున్నారు. మంగళపాలెం విద్యార్థుల దయనీయస్థితిపై ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి, పాఠశాల భవనం మంజూరు చేసి పునర్నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు వేడుకుంటున్నారు.



తాత్కాలిక షెడ్‌లో మట్టి నేలపై టార్పాలిన్‌పై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు



శిథిలమైన పాఠశాల భవనం

జిఒ 51 చట్ట విరుద్ధం

- అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి- అరకులోయ/ అరకులోయ రూరల్ : ఆదివాసీ చట్టాలను ఉల్లంఘిస్తూ పెదకోటలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ సామర్థ్యాన్ని వెయ్యి మెగావాట్ల నుంచి 1800 మెగావాట్స్‌కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జారీ చేసిన జిఒ51 తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో వేర్వేరుగా మాట్లాడుతూ, అనంతగిరి మండలం పెదకోటలో 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి, కనీసం గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోకుండా, ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ సామర్థ్యాన్ని పెంచుకునే అనుమతులెలా ఇస్తారని ప్రశ్నించారు..పెదకోట పరిసరాల ప్రాంతంలో ఆదివాసులు ఉపయోగించే గెడ్డనీటిని 16.547 ఎంసిఎంలనను ఆ ప్రాజెక్టుకు తరలించడానికి అనుమతించడానికి తీవ్రంగా ఖండించారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ప్రైవేటు సంస్థలకు భూ కేటాయింపులు నిషేధమున్నా, అదానీ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఎలా అనుమతించిందని మండిపడ్డారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అదానీ ప్రాజెక్టుకు అనుమతులివ్వడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ప్రస్తుత సిఎం చంద్రబాబు, కూటమి నేతలు, ఇపుడు అప్పటి అనుమతులను కనీసం పున:పరిశీలించకుండా తిరిగి అదే అదానీ కంపెనీకి తిరిగి కట్టబెట్టడం దారుణమని మండిపడ్డారు. అదానీ వంటి కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తి, ఆదివాసీ గిరిజనులకు అన్యాయం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

పర్యాటక రిసార్ట్స్ ప్రైవేటీకరణ వద్దు

జెడ్‌పిటిసి దీసరి గంగరాజు : హరిత రిసార్ట్స్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి- అనంతగిరి : పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ప్రకటిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోవైపు ప్రైవేటీకరణకు లోపాయికారీ ఒప్పందాలు చేసుకోవడం దుర్మార్గమని సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మండిపడ్డారు. మంగళవారం సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మొస్య ఆధ్వర్యంలో అనంతగిరి హరిత రిసార్ట్స్‌ను సందర్శించి, అక్కడి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. పర్యాటక ప్రదేశాల్లో రిసార్ట్స్ ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలతో ఒప్పందాలను వ్యతిరేకిస్తూ పర్యాటక కార్మికులతో కలిసి హరిత రిసార్ట్స్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, ఎపి టూరిజం రిసార్ట్స్ ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించు కోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని ఉల్లంఘించి ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు దీనిపై కార్మికులంతా పెద్దఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులను కోరారు కార్యక్రమంలో సిఐటియు టూరిజం యూనియన్ నాయకులు దోనేరి విజయకుమార్, సిఐటియు నాయకులు దీసరి బుద్ధరాజు, డి.సన్యాసమ్మ, ఆదివారం గిరిజన సంఘం నాయకులు పాంగి మధు పాల్గొన్నారు.



సార్ట్స్ వద్ద నిరసనలో జెడ్‌పిటిసి గంగరాజు

తొలిరోజున 85 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛను పథకాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కోరారు. మంగళవారం పాడేరు మండలం, లగిసిపల్లి పంచాయతి పివిటిజి గ్రామమైన ఉగ్గంగోయిలో కలెక్టర్, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సంయుక్తంగా లబ్ధిదారులకు ఫించన్ల పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కేటగిరీల కింద లబ్ధిదారులకు పింఛన్లు ప్రతి నెలా ఒకటవ తేదీన అందజేయటానికి రాష్ట్ర ప్రభుత్వం కత నిశ్చయంతో ఉందని, దానిని అమలు చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. ఈ ఫించన్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా 1,21,659 మందికి రూ. 51,13,96,500 లు లబ్ది చేకూరుతుందన్నారు.

మొదటి రోజైన మంగళవారం సాయంత్రం 4గంటల సమయానికి 84.69 శాతం మందికి ఫించన్లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 1,21,659 మందికి రూ. 51,13,96,500లు పించన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, సాయంత్రం 4 గంటలకు 1,03,226 (84.85శాతం) మందికి రూ.43,30,97,500 పింఛను డబ్బులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. మురళి, స్థానిక నేతలు బొర్రా నాగరాజు, నోర్ర విజయరాణి, లగిశపల్లి పంచాయతీ సర్పంచ్ పార్వతమ్మ పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

మా ఊరికి బడి కావాలి!

- కంజరితోట గిరిబాలల వేడుకోలు
- చదువు కోసం రెండు కిలోమీటర్లు కాలినడక
- గాలివానలో బడికి వెళ్లేందుకు నానా అగచాట్లు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: అరకులోయ మండలంలోని బస్కీ పంచాయతీ కంజరితోట గ్రామంలో బడి కావాలని విద్యార్థులు కోరుతున్నారు.గ్రామంలో 70 గిరిజన కుటుంబాలు నివశిస్తున్నారు. గ్రామంలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 15 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే గ్రామంలో పాఠశాల లేకపోవడంతో వారంతా విద్యాభ్యాసం కోసం కొర్రగుడ పాఠశాలకు వెళ్లక తప్పదు.కంజరితోట నుంచి కొర్రగుడ పాఠశాలకు వెళ్ళాలంటే రెండు కిలోమీటర్లు వరకు కాలినడకనే వెళ్లాల్సిందే, వర్షాలు, ఎండల్లో అంతదూరం వెళ్లి చదువుకోవడం ఇబ్బందిగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వీపున పుస్తకాల సంచిలు, చేతిలో గొడుగులతో వెల్లడం ఇబ్బందిగా ఉందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ఈదురు గాలులతో కూడిన ముసురు పట్టడంతో బడికి వెళ్ళలేక ఇబ్బందులు పడుతునట్లు విద్యార్థులు తెలిపారు. దోబురంగిని, కొర్రగూడ,కంజరితోట గ్రామానికి చెందిన విద్యార్థులు కొర్రగుడ పాఠశాలలకు వెళ్లడంతో అక్కడ తరగతి గదులు చాలక ఇబ్బందులు పడుతున్నారు.కంజరితోట గ్రామంలో పాఠశాల ఏర్పాటుచేసేవిధంగా చర్యలు చేపట్టి, తమకు చదువును చేరువచేయాలని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



వర్షంలో నడుచుకుంటూ బడికి వెళుతున్న చిన్నారులు

ఏళ్లు గడుస్తున్నా సమస్యలు అలాగే..

- ముంపు గ్రామాల్లో వరదలపై ఐటిడిఎ పిఒ సమీక్షా సమావేశం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి : కూనవరం వైస్ ఎంపిపి పెంటయ్య
- నిత్యావసరాలు అందజేయాలి : శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్



కూనవరం సమావేశంలో పాల్గొన్న పిఒ అపూర్వభరత్



రేఖపల్లి సమావేశంలో సమస్యలు వింటున్న పిఒ

ప్రజాశక్తి - కూనవరం : ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా ఉపయోగం ఉండడం లేదని పోలవరం ప్రాజెక్టు వల్ల ఏటా ముంపునకు గురవుతున్నామని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఉదయభాస్కర్ థియేటర్‌లో మంగళవారం వరదలపై ఐటిడిఎ పిఒ అపూర్వభరత్ ఆధ్వర్యంలో ఎంపిపి పాయం రంగమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ఎంపిపి పెంటయ్య మాట్లాడుతూ ఏటా ఉల్లిపాయలు, దుంపలు పంచడంతోనే సరిపోతోందని ఎద్దేవా చేశారు. కూనవరం, టేకులబోరు గ్రామస్తులు 3 నెలల పాటు ఇల్లు అద్దెకు తీసుకుని సురక్షిత ప్రాంతాలకు తరలి పోతున్నారన్నారు. గత ఏడాది అవసరమైన చోట బోట్లను ఏర్పాటు చేయలేదని కొన్ని చోట్ల మాత్రమే చేశారని ఈ సారి అవసరమైన ప్రతి చోట బోటు సదుపాయం కల్పించాలని కోరారు. గత వరదల్లో 5 పంచాయితీలకు నిత్యావసరాలు అందలేదని గుర్తు చేశారు. అత్యవసర పరిస్థితిలో కోతులగుట్ట నుండి ఏడుగురాళ్లపల్లి వరకు రోడ్డు తక్షణమే నిర్మించాలన్నారు. పాముకాటుకు అత్యవసర మందులు అందుబాటు లో ఉంచాలని డిమాండ్ చేశారు. వరదలవల్ల పంటలు వేయడం ఆలస్యం అవుతోందని మండలంలోని రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. వరదబాధితులకు ప్రతి ఒక్కరికీ 3 నెలలకు సరిపడా నిత్యావసరాలు ఇవ్వడంతో పాటు నెలకు 5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. పిఒ అపూర్వ భరత్ స్పందిస్తూ ప్రతిసమస్య పరిష్కారం చేసే విధంగా చూస్తామని అన్నారు. అనంతరం ఆయా శాఖాధికారులకు ఏ సమస్యా రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో కె.శ్రీనివాసరావు, ఎంపిడిఒ రామాంజనేయప్రసాద్, ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎఇ రాజ్‌కపూర్,డి. ఎంహెచ్ఒ పుల్లయ్య, సర్పంచులు, కార్యదర్శులు, ఎంపిటిసిలు పలుపార్టీల రాజకీయ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: రేఖపల్లిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వభరత్ ఆధ్వర్యంలో వరదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో వరదలు వస్తే ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు.

ఈ సందర్భంగా శ్రీరామగిరి సర్పంచ్ పులిసంతోష్‌కుమార్ మాట్లాడుతూ వరదలు రానున్న తరుణంలో పంచాయతీలోని ఆయా గ్రామస్తులకు ముందుగానే టార్పాలిన్స్, నిత్యావసర వస్తువులు, సోలార్‌లైట్ ఏర్పాటు చేయాలని శ్రీరామగిరి పునరావాస కేంద్రం వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. చినమట్టపల్లి ఎంపిటిసి పూనెమ్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ వరదల సమయంలో పెదమట్టపల్లి కేంద్రంగా ఒక డాక్టర్‌ను నియమించి రామవరం, కుందులూరు, ములకనపల్లి, చినమట్టపల్లి, పెదమట్టపల్లి, పంచాయతీ ప్రజలకు వైద్యసౌకర్యం కల్పించాలని సూచించారు. అవసరమైన చోట బోటు సౌకర్యం కల్పించాలని కోరారు. చింతరేవుపల్లి పునరావాస కేంద్రం వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. చింతరేవుపల్లి, రేఖపల్లిలో వాటర్ ప్లాంట్‌లకు జనరేటర్ సౌకర్యం కల్పించి తాగునీరు అందించాలని కోరారు. స్పందించిన పిఒ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అన్నిశాఖల అధికారులు, ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: వరద సమీక్షా సమావేశానికి వచ్చిన చింతూరు ఐటిడిఒ పిఒ అపూర్వభరత్ ముంపు గ్రామమైన శ్రీరామగిరి వెళ్లి కలియ తిరిగారు. గుట్టమీదకు వెళ్లి వారు ఉండే తాత్కాలిక నివాస ప్రాంతాన్ని పరిశీలించారు. పంచాయతీ సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ అభ్యర్థన మేరకు గుట్టమీద నివాస ప్రాంతంలో మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే స్పందించి హౌసింగ్ డిఇని మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసారు. గుట్ట మీద ఎంపిపిఎస్ స్కూల్ భవనాన్ని పరిశీలించి బఫర్‌స్టాక్ పాయింట్‌గా గుర్తించి నిత్యావసరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని మహిళలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వరద కష్టాలు పడుతున్నామని తాడువాయ్‌లో కాలని నిర్మించారు కానీ పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగలేదన్నారు. స్పందించిన పిఒ మీరు నేను కలిసి కాలనీని పరిశీలిద్దామని, తదుపరి చర్యలకు ఆదేశిస్తానని తెలిపారు. ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, చినమట్టపల్లి ఎంపిటిసి ప్రదీప్‌కుమార్, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు చినబాబు, మండల నాయకులు పొడియం శ్రీరామమూర్తి, పంకు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పిఒ అపూర్వభరత్

అక్రమ కట్టడాలు కూల్చే వరకూ ఉద్యమం ఆగదు

ప్రజాశక్తి- చింతూరు: ఆదివాసి సంక్షేమ పరిషత్ (274/16) ఆధ్వర్యంలో చింతూరులో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ రాజ్యాంగం ఆదివాసులకు కల్పించిన చట్టాలు అమలవ్వాలన్నా, హక్కులు దక్కలన్నా చదువుకున్న యువత మేలుకోవాలని, గ్రామస్థాయి నుంచి ఉద్యమానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అక్రమ కట్టడాల తొలగింపులో ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలను ధిక్కరిస్తూ స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారులు సొంత పెత్తనం చేస్తున్నారన్నారు. చింతూరులో అక్రమ కట్టడాలు కూల్చకపోవటానికి గల కారణాలేమిటో తెలియజేయాలని ప్రశ్నించారు. తక్షణమే చింతూరుతో పాటు డివిజన్‌లోని నాలుగు మండలాల్లో అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చివేయాలని డిమాండ్ చేశారు. కొందరు అధికారులు గిరిజనేతర స్థిరనివాసాలు వ్యాపార సముదాయాలు పోకుండా ఉండటానికి ఆదివాసీల (బినామీలు) పేరుతో కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవాలని గిరిజనేతరులకు సలహాలిస్తున్నారని మండిపడ్డారు. న్యాయస్థానం జిఒ3ని రద్దుచేస్తే ఆ నిబంధనలను తూచ తప్పకుండా పాటించిన అధికారులు అక్రమ కట్టడాలు కూల్చివేతలో ఎందుకు నియమాలు పాటించలేదో తెలపాలని నిలదీశారు. అక్రమ కట్టడాలను కూల్చేవరకూ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. చింతూరు ఐటిడిఎ పిఒ, చింతూరు ఎమ్మార్వోకి కోర్టు నిబంధనలపై చిత్తశుద్ధి లేదు కానీ ఒరిస్సా నుంచి వలస వచ్చిన తాము పోర్జా ఎస్టిలమని, మాకు ఎస్టి ధ్రువపత్రాలు ఇవ్వాలని వలసవాదులు రాజకీయం చేస్తుంటే వాళ్లకు మాత్రం తక్షణమే ఎస్టి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఆదేశిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కట్టం కిరణ్‌బాబు, ముర్రం సురేష్, గాలి శ్రీకాంత్, సున్నం కృష్ణ, పీసం సంతోష్ పాల్గొన్నారు.



చింతూరులో నినాదాలు చేస్తున్న యువత

సామాజిక పింఛన్లు అందజేయాలి

ప్రజాశక్తి - దేవీపట్నం: మండలంలో సామాజిక పింఛన్లు ఎక్కడికక్కడ లబ్ధిదారులకు అందజేయాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పిఒ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సామాజిక పింఛన్లు సచివాలయాల సిబ్బందితో ఇళ్లవద్దకే పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందుకూరుపేట పిహెచ్‌సిని పరిశీలించారు. వైద్యాధికారులు సిబ్బంది ఎంతమంది ఉన్నారు, ఒపి ఎంతవస్తోంది అనేది తెలుసుకున్నారు. మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కొత్తవీధి (ముసినికుంట) గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు.

సంత వేలం పాట రద్దు చేయాలి

ప్రజాశక్తి - విఆర్‌పురం: విఆర్‌పురం మండలంలో సోమవారం జరిగిన సంత వేలం పాటను రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సంఘ మండల అధ్యక్షులు సాయం లక్ష్మణరావు, ప్రచార కార్యదర్శి పోడియం రాజు ఐటిడిఎ పిఒ అపూర్వభరత్‌కి వినతిపత్రం అందించారు. వేలంపాట వేయాలంటే ముందుగా పత్రిక ప్రకటన ద్వారా పంచాయితీ కార్యదర్శి ఇవ్వాలి అలాకాకుండా గిరిజన ప్రాంత జనాభా లేకుండా పీసా కమిటి సభ్యులు, కార్యదర్శి, వైస్ ప్రెసిడెంట్ హాజరుకాకుండా బినామీ గిరిజన వ్యక్తులను పెట్టుకుని సంత పాట నిర్వహించారన్నారు. షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో 1/3 వంతు గిరిజన ప్రజలు వేలంపాటలో పాల్గొనకపోతే వేలం పాటను రద్దు చేయాలనే నిబంధన ఉందని, కాబట్టి సంత వేలంపాట తీర్మానాన్ని రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ

ప్రజాశక్తి- గంగవరం: స్థానిక గంగవరం వై జంక్షన్‌లో యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రాంబాబుదొర, సిహెచ్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అల్లూరి సీతారామరాజుజిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం, రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం అనే నినాదంతో యుటిఎఫ్ ముందుకు వెళతోందన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 49 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో, 51 శాతం ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నట్లు చెప్తున్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఉపాధ్యాయ సంఘాలతో ఐక్యవేదికను ఏర్పరిచి ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించుకోగలిగామన్నారు. సుమారు పదకొండువేల కోట్ల మేర పిఎఫ్, ఎపిజిఎల్ఐ, మెడికల్ రియింబర్స్‌మెంట్, సిపిఎస్ కాంట్రిబ్యూషన్ వంటి బకాయిలు సాధించుకున్నామన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ తిరిగి నియమించుకునేలా పోరాటం చెయ్యాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కె.రఘుబాబుదొర, మహిళా అధ్యక్షురాలు రుక్మిణిదేవి, పత్రికబాధ్యులు అన్నం చిన్నారెడ్డి, వెంకన్నదొర, లలిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ

సొలుబొంగికి రోడ్డు, బడి మంజూరు

'ప్రజాశక్తి' కథనానికి జిసిసి చైర్మన్ కిడారి స్పందన

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల కేటాయించేలా చర్యలు

ప్రజాశక్తి -అనంతగిరి : అల్లూరి జిల్లా ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి టిడిపి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని. రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి .శ్రావణ్ కుమార్ అన్నారు . పినకొట పంచాయతీ సొలుబొంగి గ్రామ విద్యార్థులు చదువుకు రైవాడ జలాశయం మీదుగా నాటుపడవల్లో అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం తామరబ్బ ఎంపీపీ పాఠశాలకు నిత్యం రాకపోకలు సాగిస్తూ చదువు కొంటున్న పరిస్థితుల్లో పడుతున్న ఇబ్బందులపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తా కథనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లానన్నారు., వారు వెంటనే స్పందించి ఆ గ్రామానికి రోడ్డు. పాఠశాల నిర్మాణానికి రూ.రెండు కోట్ల 75 లక్షల నిధులు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం విద్యా వైద్యంపై మొండిచేయి చూపిందని, దీంతో మారుమూల గిరిజన గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తల ద్వారా గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అల్లూరి జయంతికి సన్నాహాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రం డుంబ్రిగుడలో ఈనెల 4న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతికి సన్నాహాలు చేస్తున్నామని అల్లూరి సంఘం మండల అధ్యక్షుడు సూర్యప్రకాష్ తెలిపారు. మంగళవారం అల్లూరి కమ్యూనిటీ భవనంలో సంఘ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అల్లూరి స్ఫూర్తితో యువత ముందడగు వేసి గిరిజన చట్టాలు, హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామన్నారు కార్యక్రమంలో టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, అల్లూరి సంఘం మండల కార్యదర్శులు అరుణ్‌రాజు, నవసూర్య పాల్గొన్నారు.



రాజుపాక వద్ద విరిగి పడిన చెట్టు

చెట్టు కూలి రాకపోకలకు ఇక్కట్లు

గాలివానతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి- అనంతగిరి : వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా గాలివాన బీభత్సంతో కురుస్తున్న వర్షాల కారణంగా ఘాట్ రోడ్డుతోపాటు మారుమూల గ్రామాల రోడ్లలో చెట్లు విరిగిపడడంతో రాకపోకలకు ఇక్కట్లు ఏర్పడ్డాయి. విరిగిన చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుండి సోమవారం సాయంత్రం వరకు గాలివాన బీభస్వం సష్టించింది .దీనితో అనంతగిరి పిహెచ్ కాలనీ అరకు మెయిన్ రోడ్డు భారీ చెట్టు నేలకొరిగింది. దీంతో అరకు నుండి విశాఖ మార్గంలో వాహనాల రాకపోకలు రెండు గంటల పాటు నిలిచిపోయాయి. తెలుసుకున్న మండల అధికారులు తక్షణమే స్థానిక గ్రామస్తుల సహాయంతో చెట్టును తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. అలాగే డేకపురం రోడ్డు రాజుపాక గ్రామం సమీపంలో మరో చెట్టు విరిగిపడింది అక్కడున్న 108వాహనం, ఆటో, బైక్‌లకు త్రుటిలోనష్టం తప్పింది. అలాగే పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి చెట్టు కూలిపోవడం, విద్యుత్ తీగలపై పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.రెండురోజులుగా పలు గ్రామాల ప్రజలు అంధకారంలో మగ్గాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రాముల ప్రజలు చీకటిమయంలో మగుతున్నారు

మ్యుటేషన్ల జాప్యంపై ఆగ్రహం

- సంతృప్తికర రెవెన్యూ సేవలు అందించండి
- తహశీల్దార్లతో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- పాడేరు : రెవెన్యూ సదస్సులు జరిగి ఆరు నెలలు గడిచినా నేటికీ మ్యుటేషన్లు పరిష్కారంలో నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం, అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్లు, 22 మండలాల తహశీల్దార్లతో పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, మ్యుటేషన్లు, భూముల రీసర్వే, ఇతర రెవెన్యూ సమస్య పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 368 రెవెన్యూ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని మండిపడ్డారు.. సచివాలయాల్లో రెవెన్యూ సేవలు సక్రమంగా అందడం లేదన్నారు. ఎపి సేవా సర్వీసెస్ వెబ్‌సైట్‌లో పరిష్కరించాల్సిన ఫిర్యాదులెన్ని ఉన్నాయని ఆరాతీసారు. పిజిఆర్ఎన్, రెవెన్యూ సదస్సుల ఫిర్యాదుల పరిష్కారానికి తాహశీల్దార్లు చొరవ చూపించాలన్నారు. సమస్యలపై పరిష్కారంపై ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షించి, నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. మూడు డివిజన్లలోని సబ్ కలెక్టర్లు దీనిపై దృష్టిపెట్టాలన్నారు. రీ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు.

వర్షాలపై అప్రమత్తత

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటాలన్నారు. మట్టి ఇళ్లు, కచ్చా ఇళ్లలో ఉన్న వారిని పక్కా గృహాలకు తరలించాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కాజ్ వేలను గుర్తించి నివేదించాలన్నారు. కొట్టుకుపోయిన కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులు, రెడ్ రిబ్బన్లు ఏర్పాటు చేయాలన్నారు. వరదలొచ్చే సమయంలో ప్రజలు గెడ్డలు, వాగులు దాటవద్దని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలపాతాల వద్దకు మధ్యాహ్నం తర్వాత పర్యాటకులను అనుమతించరాదని తహశీల్దార్లను ఆదేశించారు.

15నాటికి భూముల రీసర్వే పూర్తి : జెసి

భూముల రీసర్వే ప్రక్రియ ఈనెల 15నాటికి పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ ఆదేశించారు. భూములు రీసర్వే పకడ్బందీగా చేయించాల్సిన బాధ్యత తాహశీల్దారులపైనే ఉందన్నారు. రీ సర్వే చేయడానికి 13 నోటిఫికేషన్ ఎందుకు జారీ చేయడం లేదని ప్రశ్నించారు., సాంకేతిక సమస్యలుంటే సబ్ కలెక్టర్ దృష్టిలో పెట్టి పరిష్కరించాలన్నారు. పెదబయలు, జి.మాడుగల మారేడుమిల్లి మండలాల్లో రీ సర్వే, 13 నోటిఫికేషన్ జారీపై సంతృప్తి వ్యక్తంచేసారు. పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామ పంచాయతీల నుండి వచ్చిన ఫిర్యాదులపై విఆర్ఒలతో సమీక్షించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.పద్మావతి, వర్చువల్‌గా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పాల్గొన్నారు.

ఇఏపిఆర్‌డిగా సీతామహాలక్ష్మి



సీతామహాలక్ష్మి

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ఇఏపిఆర్‌డిగా సి.హెచ్.సీతామహాలక్ష్మి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఇఏపిఆర్‌డిగా పనిచేసిన యు.వి.ఎస్. శ్రీనివాసరావు సాధారణ బదిలీల్లో భాగంగా అచ్యుతాపురానికి బదిలీ అయ్యారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో ఇఏపిఆర్‌డిగా పనిచేస్తున్న సీతామహాలక్ష్మి, చింతపల్లి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మిని మండల పరిషత్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు సూచనలు

ప్రజాశక్తి-జికె.వీధి: మండలంలోని మొండిగడ్డ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేష్ బాబు, సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్.సందీప్ నాయక్ పాల్గొని రైతులకు ప్రస్తుత వర్షాలు అధికంగా కురుస్తుండడంతో నారు మడిలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇతర పంటలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గబులంగి హరిబాబు, సచివాలయ సిబ్బంది,ఎంపిఈఓ జయ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



జికె.వీధిలో కేకు కట్ చేస్తున్న వైసిపి నేతలు

ఘనంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- జికె. వీధి: పాడేరు ఎమ్మెల్యే, వైసిపి అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్య రాస విశ్వేశ్వరరాజు 41వ పుట్టినరోజు వేడుకలను గూడెం కొత్తవీధిలో పార్టీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్, ఎంపిపి బోయిన కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి మాజీ మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, అల్లూరి జిల్లా కోశాధికారి కుందేరి రామకృష్ణ, స్థానిక సర్పంచ్ కొర్ర సుభద్ర, దేవరపల్లి ఎంపీటీసీ పోతురాజు కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ వంతల అరుణ్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు షేక్ దావీదు, సీనియర్ నాయకులు వంతల చంటిబాబు, కంకిపాటి నారాయణ, బోయిన వెంకట్, కొర్ర కృప, కొర్ర రాంబాబు, గెమ్మెల రాంబాబు పాల్గొన్నారు.

పాడేరు: స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు జన్మదినం సందర్భంగా మంగళవారం. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు మండల నాయకులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు, పాడేరు ప్రభుత్వ హాస్పిటల్‌లో బాలింతలు, గర్భిణులు, రోగులకు పండ్లు, పాలు,రొట్టెలు పంపిణీ చేశారు, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగస్తులు నాయకులు అభిమానులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కురుస పార్వతమ్మ , సీధరి మంగ్లన్న దొరా, శరభ సూర్యనారాయణ, కుంతురు నరసింహ మూర్తి, దూసురు సన్యాసి రావు, లకే రామకృష్ణ పాత్రుడు, సల్ల చిట్టమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : అధిక దిగుబడులు సాధించి రైతులు ఆదాయం పెంచడమే లక్ష్యంగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. ఖరీఫ్ సీజన్ లో సాగు విస్తీర్ణం పెంచడానికి చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలని సూచించారు.. వ్యవసాయానుబంధ రంగాలలో 15 శాతం వృద్ధి సాధించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుండి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయశాఖ, సెరీకల్చర్, మత్స్యశాఖ, ఉద్యాన వన, ఎపి ఎం ఐపి, పశుసంవర్ధక శాఖ, మార్కెఫెడ్, వ్యవసాయ మార్కెటింగ్, గ్రామీణ నీటి సరఫరా గనులు భూ గర్భశాఖ, పరిశ్రమలు, ఎపి ఇపిడిసి ఎల్, హౌసింగ్ శాఖలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పంట రుణాలు అందించాలని చెప్పారు. మల్బరీ సాగును విస్తరించాలని సూచించారు. అందుబాటులో రిజర్వాయర్లలో చేప పిల్లలను పెంపకానికి చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్మించిన ఫారం పాండ్లో చేపల పెంపకం చేయాలని అన్నారు. చేపల పెంపకం పై ఎంపిడి ఓలకు అవగాహన ఉండాలని అన్నారు. ఈ సీజన్లో చేపల పెంపకానికి ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. కాఫీ రైతులు పార్చిమెంటు కాఫీ తయారు చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని ఉద్యాన వన అధికారులను ఆదేశించారు. ఎంత మంది రైతులకు బేబీ పల్పర్లు ఉన్నాయి ఎన్ని పల్పర్లు అవసరమవుతాయి అని ఉద్యాన వన అధికారులను ప్రశ్నించారు. కాఫీ రైతులకు మిరియాల శుద్ధి యంత్రాలు, బేబీ పల్పర్లు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జీడి తోటల పునురుద్ధరణ పనులను అడిగితెలుసుకున్నారు. కొత్తగా జీడి తోటలు విస్తరణ చేయాలని పేర్కొన్నారు. వై.రామ వరం మండలంలో అవకాడో పండ్ల తోటలు పెంచాలని సూచించారు. 40 హెక్టార్లలో పసువు, కూరగాయలు సాగును విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించామని అన్నారు. జిల్లాలో విజిటబుల్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 2 వేల ఎకరాల్లో సూక్ష్మ సాగునీటి సదుపాయాలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఈనెల 10వ తేదీ నాటికి పశువులకు వ్యాక్సినేష్, గొర్రెలకు, మేకలకు డీ వార్మింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. చింతూరు ఐటిడిఎ పరిధిలో డైరీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్, అభిషేక్ గౌడ, రంపచోడవరం ఐటిడిఏ పిఓ కె. సింహాచలం, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్బి ఎస్ నంద్, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు, గృహ నిర్మాణ శాఖ ఇ ఇ బి. బాబు, సివిఒ ప్రసాద్, పశు సంవర్ధక శాఖ డిడి వి. జయరాజు, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, 22 మండలాల ఎంపిడిఒలు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మంగళవారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు సిరిగిందలపాడులో కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రంపచోడవరం టిడిపి మండల మాజీ అధ్యక్షులు అడబల బాపిరాజు, ప్రధాన కార్యదర్శి పి.మోహన్, ఎఎంసి వైస్‌చైర్మన్ సలాది బాపిరాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పి.ఆర్.పి శ్రీను, బిజెపి నాయకులు లక్ష్మి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు నిరంజనీదేవి, టిడిపి నాయకులు సిద్ధ వెంకన్న, ఎడ్లపల్లి పోసిబాబు, సత్య, హెచ్‌డిసి మెంబర్ చోటు, సూరిబాబు, జనార్ధనరావు, రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం : గంగవరం మండలం, ఎండపల్లి, ఈ.రామవరం గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే శిరీషాదేవి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ ఎంపిపి డాక్టర్ తీగల ప్రభ, మండల టిడిపి అధ్యక్షులు పాము అర్జున్ , ప్రధాన కార్యదర్శి భాను, రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, ఎంపిటిసి పండా ఆదినారాయణ పాల్గొన్నారు.



విద్యుత్ తీగలపై పడిన చెట్టు

విద్యుత్ లైన్‌పై కూలిన చెట్టు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి వలసగెడ్డ మధ్య త్రీఫేస్ 33 కెవి విద్యుత్‌తీగలపై చెట్టు కూలిపోయింది. వైర్లు కలిసిపోవడంతో సీలేరు జలవిద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న స్విచ్‌యార్డ్‌లో 33 కెవి లైన్‌కి విద్యుత్ సరఫరా చేసే జంపర్లు 2 కాలిపోగా, 2 ఇన్సులేటర్లు పగిలిపోయాయి. దీంతో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వినియోగదారులు ఎపి జెన్కో ఉద్యోగులు ఇంజనీర్లు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు గురయ్యారు. ఎపి జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్ అప్రమత్తమయ్యారు. లోపాలు గుర్తించి సరిచేయాలని సబ్‌ఇంజనీర్, ఇన్‌చార్జి ఎఇ నాగేశ్వరరావును ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన సిబ్బంది పనులు చేపట్టి చెట్టును తొలగించి విద్యుత్తులైన్లు సరి చేశారు.

గంజాయి కేసులో నిందితునికి 12 సంవత్సరాల జైలు

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసు నమోదైంది. ఈ కేసులో 96 కిలోల గంజాయి తరలిస్తున్న నిందితుడు దేవర శివను అరెస్టు చేశారు. విచారణ అనంతరం ట్రయల్‌దశలో అనకాపల్లి జిల్లా, గొలుగొండ మండలం, రవణపల్లి గ్రామానికి చెందిన శివకు జూన్ 30న జిల్లా కోర్టు 12 సంవత్సరాల జైలుశిక్ష మరియు రూ.1,20,000/- జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అప్పటి కొయ్యూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.మల్లికార్జునరావు ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ప్రసాద్ వాదనలు వినిపించారు. కొయ్యూరు సిఐ రమణ, కొయ్యూరు ఎస్ఐ మాట్లాడుతూ ఎవ్వరైనా గంజాయి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



వైద్యులను సన్మానిస్తున్న జెన్‌కో ఇంజనీర్లు



చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు ఎపి జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న భవ్యహెల్త్‌సర్వీసెస్ ఆసుపత్రిలో డాక్టర్స్‌డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.ఆకాష్, వైద్యాధికారి మృదుల, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఖాదర్‌మస్తాన్‌వల్లిని ఎపి జెన్‌కో ఇఇ శ్రీనివాస్‌రెడ్డి, ఎఇలు సిహెచ్.సురేష్, అనుదీప్ భవ్యహెల్త్‌ఫార్మసిస్ట్ వినోద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు దైవంతో సమానమని పునర్జన్మనిచ్చేది వారే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ, టెక్నీషియన్ సత్యనారాయణ, విక్రమ్ ఎఎన్ఎంలు నిరీక్షణ, నయోమి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్ర ప్రియాంక ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇంద్ర ప్రియాంక మాట్లాడుతూ, రోగుల ఆరోగ్యమే లక్ష్యంగా సేవలు అందిస్తున్న వైద్యులు సమాజంలో ముఖ్యభూమిక పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడియాట్రీషియన్ డాక్టర్ నీలవేణి, గైనకాలజిస్ట్ డాక్టర్ వాసవి, జనరల్ మెడిసిన్ వైద్యాధికారి డాక్టర్ సంతోష్, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ అనూష, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరరావు, వైద్యాధికారులు డాక్టర్ శ్రీలత, డాక్టర్ రుక్మిణి, డాక్టర్ లావణ్య, డాక్టర్ భారతి, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెలో భవననిర్మాణ కార్మికులు పాల్గొనాలి



రాజఒమ్మంగిలో నినాదాలు చేస్తున్న భవననిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని సంక్షేమబోర్డును కాపాడుకోవాలని స్థానిక విఘ్నేశ్వర తాపీమేస్త్రీల సంఘం నాయకులు ఎన్.అచ్చారావు, ఎస్.వీరబాబు ఎన్.రామకృష్ణ, బి.శ్రీను తదితరులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తాపీమేస్త్రి సంఘం సమావేశ మందిరంలో తాపీమేస్త్రిల నెలవారీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. భవననిర్మాణరంగంలో ఉన్న ఇతర కార్మికులు యూనియన్‌లో సభ్యులుగా చేరాలని, సంక్షేమ గుర్తింపుకార్డుల కోసం నమోదు చేసుకోవాలని కార్మికులను కోరారు. ఈనెల 9న జరిగే సమ్మెలో భవననిర్మాణ కార్మికులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటీయు నాయకులు శ్రీను, ప్రజాసంఘాల నాయకులు జగన్నాథం బుజ్జి త్రిమూర్తులు, శీను, సత్తిబాబు అప్పారావు పాల్గొన్నారు.

కొయ్యూరు : ఈ నెల 9 తేదీన దేశవ్యాప్త జరిగే సమ్మెను జయప్రదం చేయాలంటూ సిఐటియు, సిపిఎం జిల్లా నాయకులు ఎస్. సూరిబాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాల కోసమే చట్టాలను మార్పులు చేస్తున్నామంటూ 150 ఏళ్ల క్రితం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాల్లో కార్మికులకు ఉపయోగపడే అంశాలను తొలగించడం దుర్మార్గమన్నారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. విద్యుత్ రైల్వే, రవాణా, ఎల్ఐసి విశాఖఉక్కు మొదలైన వాటిని మోడీ ప్రభుత్వం తెగ నమ్ముతోందని విమర్శించారు. సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గిరి ప్రదక్షిణకు కండిషన్‌లో ఉన్న బస్సులు నడపాలి

జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న సింహాచలం గిరి ప్రదక్షిణకు కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ఎపిఎస్ ఆర్టిసి విశాఖ జిల్లా రవాణాధికారి బి.అప్పల నాయుడు ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆర్టిసి విశాఖజిల్లా అధికారులు, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో మాట్లాడుతూ ఆర్టిసికి ఆదాయం పెంచడంతో పాటు, డీజిల్‌ను ఆదా చేసి ఖర్చులను తగ్గించుకోవాలని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు, ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బస్సులు సజావుగా పంపించేందుకు వివిధ ప్రదేశాల్లో పాయింట్ డ్యూటీలు వేశామన్నారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ రాజశేఖర్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి,డిపో మేనేజర్లు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, ట్రాఫిక్,మెకానికల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో జిసిసి భవనం



జిసిసి భవనం

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు మండలం గొలుగడ మండలం కృష్ణాదేవిపేటలో జిసిసి భవనం నిర్మించి సుమారు 50 సంవత్సరాలు కావడంతో ప్రస్తుతం అది బీటలు వారి కూలిపోయే పరిస్థితి నెలకొంది. వర్షాలు ఎక్కువ కురుస్తుండడంతో భవనం సరిగా లేకపోవడం వలన బియ్యం, నిత్యావసర వస్తువులు నిల్వ చేసేందుకు ఇబ్బందిగా ఉంది. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవటంలేదని తెలిపారు. సమస్య సత్వరమే పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఎంపిటిసి ప్రదీప్‌కుమార్

సబ్సిడీ విత్తనాలు, రైతు భరోసా అందించాలి

ప్రజాశక్తి - విఆర్‌పురం: చినమట్టపల్లి పంచాయతీ పరిధిలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు రైతుభరోసా తమకు అందడం లేదన్నారు. పొలాలు ఇకెవైసి చెయ్యడం లేదని పోలవరం ముంపు పేరుతో ఇలా ఇబ్బందులకు గురిచేయడం ఏంటని నిలదీశారు. ఎంపిటిసి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఈ విషయమై కలెక్టర్ దృష్టికి వెళ్లేలా ప్రజలంతా కలిసి ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపిపికారం లక్ష్మి, సర్పంచ్ పిట్ట రామారావు, పీసా కమిటి సభ్యులు సున్నం దూలయ్య, కోటం జయరాజు,సున్నవారిగూడెం,చినమట్టపల్లి,కన్నయ్య గూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.



కళాశాల భవనం పరిశీలిస్తున్న గిరిజన సంఘం బృందం రాష్ట్ర కమిటి సభ్యులు సురేష్

డిగ్రీ కళాశాల భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంఘం బృందం రాష్ట్ర కమిటి సభ్యులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను మంగళవారం వారు పరిశీలించారు. సురేష్ మాట్లాడుతూ నేటికీ నిర్మాణ దశలోనే ఉందని, గోడలు, శ్లాబ్ మినహాయిస్తే ఇంకా పనులు పూర్తి కాలేదని విద్యుత్, పెయింటింగ్, టైల్స్, టాయిలెట్స్, ప్రహరీ పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉందన్నారు. ఐదేళ్లుగా కళాశాలలో ఒకపూట తరగుతులు మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. నిర్మాణంలో ఉన్న కళాశాల భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని అదనపు గదులు మరియు సైన్సు కంప్యూటర్ ల్యాబ్‌కు సంబంధించిన భవన నిర్మాణాలను కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి కారం నాగేష్, మొట్టమ్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.